# తరాల అంతరం

సాయంకాలపు పైరుగాలుల చల్లదనాన్ని ఆస్వాదించి ఉల్లాసంగా పాడుకుంటూ ఇంటికి చేరిన నాకు వీధి గుమ్మం దగ్గరే ఒక్కసారిగా వేడి షాడ్పుకొట్టినట్లై తలుపు బైటే నిలబడిపోయాను. నాకు అలా కంగారు పుట్టడానికి కారణం మామయ్య గొంతు పెద్దగా బైటికి వినపడడమే.

మామయ్య ఎందుకొచ్చాడో నాకు తెలుసు. నేను కాలేజీలో చేరిన రెండునెలల్లో అతను మూడో సారి రావడం. ముగ్గురాడపిల్లలున్న మామయ్య కొడుకున్న చెల్లెలింటికి ఎందుకొస్తాడన్నది ఎవ్వరికీ చెప్పనవసరంలేదు.

నేనతని గొంతు విని కంగారుపడడానికి కారణం మామయ్య చాలా చాదస్తపు మనిషి అవడమే. పూర్వకాలపు మనిషికావడంతో ఈ కాలపు యువకుల ఆలోచనల్ని, అభిప్రాయాలని తెలుసుకోకుండా, చెప్పినా వినకుండా, తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళని వాదించే రకం.

దానికి తోడు కొంతకాలం క్రితం అమ్మమ్మ పోవడంతో మామయ్యకి కూతురు పద్మ పెళ్ళి ఏడాదిలోగా చేస్తే కన్యాదాన ఫలితం తల్లికి దక్కుతుందన్న నమ్మకంతో ఎదురుగా కనబడుతున్న నా మీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించసాగాడు. పద్మ పుట్టినప్పటి నుంచీ నా భార్యగానే పల్లెటూరిలో పిలవబడేది. మా ఇళ్ళల్లో పెద్దల అభిప్రాయం కూడా అదే. చిన్నతనమప్పుడు మామయ్య ఇంటికెళ్ళగానే ఆ ఊరి జనాలు మమ్మల్ని భార్యా భర్తలమనే దృష్టితో చూసి పలకరించడంతో యవ్వన దశలోకి ప్రవేశించిన మా మనస్సుల్లో కూడా అవే భావాలు మా హృదయ కుసుమాలకి తుప్పోడిలా హత్తుకున్నాయి.

ఆ భావం పద్మలో మరింత ఎక్కువై, పెద్దదైన తరువాత స్త్రీ సహజమైన సిగ్గుతో తనకి దూరంగా వుండసాగింది. షికార్లు, ఆటలమాట అటుంచి, మాట్లాడడం, ఆఖరికి కనబడడం కూడా మానేసింది. కనబడినప్పుడు తన పలకరించబోయినా ఏదో తప్పు చేస్తున్నట్లు, చేస్తున్న పని హఠాత్తుగా మానేసి గదిలోకి పారిపోయి చాటుమాటుగా తనని చూసేది. పల్లె వాతావరణాన్ని జీర్ణించుకున్న వ్యక్తుల పరిధిని తెలిసిన నేనూ అందుకనుగుణంగానే మసలుకునేవాడిని.

మామయ్య మొదటిసారి పద్మని మా ఇంటి కోడలిగా చేసుకోమని అడగవచ్చినప్పుడు, నేను కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో చేరి వారం కూడా కాలేదు. రాజమండ్రి దగ్గరే నాన్నగారి ఉద్యోగం. అమ్మానాన్ననీ వదిలి వుండడం మొదటిసారి కావడంతో శనివారం బయలుదేరి వాళ్ళదగ్గరికి వెళ్ళేను. నేను వెళ్ళిన కొద్ది సేపటికి మామయ్య నాన్న అమ్మలతో నా పెళ్ళి విషయం మాట్లాడడం, అమ్మ "అలాగేరా! నీ కూతుర్ని చేసుకోడానికి మాకేం అభ్యంతరం?" అనడంతో ఆనందించిన మామయ్య "ఒక్కసారి ప్రసాద్‌తో మాట్లాడి చెప్తా" నన్న నాన్నగారి మాటలకి నొచ్చుకోడమే కాకుండా, అవమానంగా ఫీలయి. "బావా! ఇది చిన్నప్పటి నుంచీ మనం అనుకుంటున్న సంబంధమేకదా! అలాంటిది ఈ రోజు కుర్రాడు ప్రసాద్‌ని అడగడమేమిటి?" అన్నాడు వస్తున్న కోపాన్ని అణచుకుంటూ.

"నా ఉద్దేశ్యం అది కాదు బావా! ఇప్పుడే చేసుకుంటానంటాడో లేదో వాడిని కూడా అడగాలి కదా" అనగానే కాస్త తమాయించుకుని "ఆ విషయమేదో కనుక్కుని చెప్పండి. సాయంకాలం బస్సుకి వెళ్ళిపోవాలి, కుప్పనూర్పులు ప్రారంభిస్తారు కూడాను" అన్నాడు.

మామయ్య ఇంట్లో లేని టైము చూసి అమ్మ నన్ను హాల్లోకి పిల్చి, మామయ్య అడిగిన మాటల్ని అడిగింది.

ఉదయం మామయ్య మాటలు విన్నాక ఒక నిర్ణయానికి వచ్చిన నేను "అమ్మా! నాకు పద్మని పెళ్ళి చేసుకోడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. పద్మంటే నాకూ ఇష్టమే. కానీ ఒకటి- నా చదువు పూర్తయి ఉద్యోగంలో చేరితేగానీ నేను పెళ్ళి చేసుకోదల్చుకోలేదు. ముందు నా కాళ్ళమీద నేను నిలబడాలి ఆ తరువాతే పెళ్ళి! పద్మకీ, నాకూ కూడా వయసేం మించిపోలేదు. ఇదీ నా నిర్ణయం. మామయ్యకి ఈ విషయంచెప్పు" అని ఖచ్చితంగా చెప్పేశాను. అమ్మ నా మాటలకి కాస్త బాధపడ్డట్టు ముఖం పెట్టి, నాన్నగారికేసి చూసింది. నాన్నగారు మా ఇద్దర్నీ ఓసారి చూసి పక్కనున్న పేపరందుకుని తనకేం పట్టనట్లు చదువుకోసాగారు.

నాన్న ప్రవర్తనకి కోపం రెట్టింపయిన అమ్మ "ఏమండీ! ఏమీ మాట్లాడరేమిటి? ఏం పట్టనట్లు పేపరుచ్చుకుని కూర్చుంటారేమిటి?" అన్న దానకి "నన్నేం మాట్లాడమంటావు కాంతం! వాడి భవిష్యత్ నిర్ణయించుకునే

వయసు వాడికొచ్చింది. వాడు చెప్పిన దాంట్లో తప్పేమన్నా వుంటే మనం సరిదిద్దాలిగానీ వాడి నిర్ణయం కాలాన్నిబట్టి సరైనదైనప్పుడు వాడికేం చెప్తాం?! మీ అన్నయ్య పూర్వ కాలపు మనిషి, పల్లె వాతావరణానికి అలవాటుపడ్డ మనిషి, తన పరిధిలో తను ఆలోచిస్తున్నాడు. కాలాన్ని బట్టి వీడు ఆలోచిస్తున్నాడు. ప్రసాద్ చెప్పిన విషయాలు మీ అన్నయ్య రాగానే చెప్పు" అన్న నాన్నగారి మాటలకి అమ్మ ఏమీ జవాబివ్వకుండా లోపలికి వెళ్ళిపోయింది.

అమ్మ నోట నా నిర్ణయాన్ని విన్న మామయ్య ఏ భావం వ్యక్తం చెయ్యకుండా వెళ్ళిపోయాడు.

రెండోసారి మళ్ళీ తను దసరా సెలవలకి వెళ్ళినప్పుడు వచ్చిన మామయ్య అమ్మతో మళ్ళీ అదే ప్రస్తావన తీసుకొచ్చి, "ఎలాగన్నా ప్రసాద్‌ని వప్పించి ఈ మూడు ముళ్ళు వేయించి అమ్మకా పుణ్యం దక్కించి, నా భారం కూడా దింపవే! కావాలంటే వాడి మాట ప్రకారమే వాడు ఉద్యోగస్థుడయ్యాకనే దాన్ని కాపరానికి పంపిస్తా" నంటూ బ్రతిమాలడం, అమ్మ మళ్ళీ నాకు చెప్పి బ్రతిమాలడం, నేను మొదటిసారి చెప్పిన మాటల్నే మళ్ళీ చెప్పడంతో మామయ్య చిన్నబుచ్చుకుని అమ్మ దగ్గర నాలుగు పరుషవాక్యాలాడి వెళ్ళిపోయాడు.

ఈ సారొచ్చిన మామయ్య తాడో పేడో తేల్చుకుని వెళ్ళేలాగే కనబడ్డాడు. మా మధ్యన నలిగిపోతున్న అమ్మ పరిస్థితి చూస్తుంటే జాలిగావున్నా, నా నిర్ణయం నాకు 'కరెక్టే' అనిపించి, నా నిర్ణయానికి తిరుగులేదని గట్టిగా చెప్పేయడంతో, నా మాటల్ని విన్న మామయ్య తాడిచెట్టంత ఎత్తు ఎగిరాడు. "నీ కొడుకు చేసుకోకపోతే నా కూతురికి పెళ్ళే అవకపోదు. అంత బ్రతిమాలి, కాళ్ళట్టుకుని నీ కొడుక్కి ఇచ్చే ఖర్మ నాకేం పట్టలేదు. చూడు నెల్లాళ్ళల్లో నా కూతురి పెళ్ళిచేసి చూపిస్తా" అనడమే కాకుండా, "నీ కొడుకా టౌనులో ఎవత్తినో కట్టుకొని తీసుకొస్తే అప్పుడు నీకు తెలుస్తుంది" అంటూ కోపంగా వెళ్ళిపోయాడు.

పట్టుదల, కోపం మనసంతా నింపుకున్న మామయ్య అన్నంత పనీచేసి పద్మ పెళ్ళి శుభలేఖ నా రూంకి కూడా ఒకటి పంపాడు.

ఆ శుభలేఖ చూసిన నా మనసు వెయ్యికిలోల బరువెక్కిపోయింది. మామయ్య మూర్ఖత్వంతో మా ఆశల మొగ్గల్ని తుంచేశాడు.

'గట్టిగా నాలుగేళ్ళపాటు కళ్ళు మూసుకుంటే పద్మ నా భార్య అయ్యేది. మామయ్య కోపానికి పంతానికి మమ్మల్ని బలిచేశాడు. ఇందులో నా తప్పేంత?'' అని ఆలోచించసాగాను.

ఈ సంఘటన మరుపున పడడానికి నాకు చాలా టైము పట్టింది. నేనుకాదు సరికదా అమ్మా, నాన్నకూడా పద్మ పెళ్ళికి వెళ్ళే సాహసం చెయ్యలేదు. కానీ సెలవలకి వెళ్ళినప్పుడు అమ్మ మాత్రం పద్మ ఈ ఇంటి కోడలు కానందుకు బాధపడడంతో పాటు నా మీద కోపాన్ని కూడా వెలిబుచ్చింది. మేనకోడలు కోడలయితే చేతికీ నోటికి ఎంగిలుండదని, ఇంట్లో కలిసిపోయేదని బాధపడింది. నా నుంచే పద్మ తన కోడలు కాలేదని నిందించింది.

మామయ్య పద్మకి పెళ్ళి చెయ్యడం మంచిపనే చేశాడంది. మామయ్యకి అమ్మ చెల్లెలేగనక అన్నని సమర్థించడం సమంజసమే! ఇంక అమ్మతో వాదించడం ఇష్టంలేక అక్కడినుంచి వెళ్ళిపోయాను.

ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం పరీక్షలు రాసి మూటాముల్లెతో ఎంతో హుషారుగా ఇంటి కొచ్చిన నాకు అమ్మ వినిపించిన పిడుగులాంటి వార్త నా ఆనందాన్నంతా తునాతునకలు చేసింది.

"ఒరే ప్రసాదూ! రేపోసారెళ్ళి మామయ్యని, పద్మని చూసిరారా! పాపం మామయ్య చాలా కృంగిపోతున్నాడు. పద్మనయితే చూడలేకపోయాననుకో! పిచ్చిపిల్ల" అంటూ కళ్ళనీళ్ళెట్టుకుని బాధ పడుతున్న అమ్మని "అమ్మా! అసలీ ఘోరం ఎలా జరిగింది?'' అని అడిగాను.

"పండక్కి వచ్చిన పద్మని పుట్టింటినుంచి తీసుకెళ్ళాలని వస్తొంటే బస్సు నదిలో పడిపోయిందటరా! పోయినవాళ్ళల్లో పద్మభర్త శవంవుందిట. దాని ఖర్మ కాకపోతే, ఇరవై ఏళ్ళు నిండనిదానికి వైధవ్యం ప్రాప్తించడం ఏమిటిరా! ఎంత దురదృష్టమో చూడు" అంటూ చెప్తున్న అమ్మ మాటలు వింటుంటే నాకు తట్టుకోలేని బాధ కలిగింది. పద్మ పరిస్థితి తల్చుకున్న నా మనసు పరిపరివిధాలపోసాగింది. అందులో అలా ఆ పల్లెలో వున్న పద్మ గురించి తల్చుకుని మరింత బాధపడసాగాను.

సాయంత్రం మామయ్య ఇంటికెళ్ళిన నన్ను చూస్తూనే మామయ్య గట్టిగా

కౌగిలించుకుని ఘొల్లుమన్నాడు. 'ఇన్నేళ్ళూ మామీద కోపంతో బంధాన్ని, అనుబంధాన్ని తెంచుకున్న ఆ మామయ్యేనా? ఈ మామయ్య' అనిపించింది నాకు. మనిషి బాగా డీలాపడిపోయాడు.

చిన్నపిల్లాడిలా గోలపెడుతున్న మామయ్యని ఎలా ఊరడించాలో తెలీని నేను మామయ్య వద్ద స్తబ్దులా కూర్చుండి పోయాను.

'మామయ్యే ఇంత బాధపడుతుంటే ఇంక పద్మ బాధెలాగుంటుందో' అని ఊహించుకుంటూ ఆమె గదిలోకి వెళ్ళాను. యోగినిలా కూర్చున్న ఇరవై ఏళ్ళ పద్మ తిలకంలేని నుదురు, బోసిచెవులు, చేతులు, మెడతో దర్శనమివ్వగానే దుఃఖం కట్టలు తెంచుకొచ్చింది.

"ఎవరి ఖర్మకి ఎవరూ బాధ్యులుకారు బావా! బాధపడకు" అంటూ నన్ను ఊరడిస్తున్న పద్మవైపు చిత్రంగా చూశాను. ఈ కొద్ది ఏళ్ళల్లో పద్మ మానసికంగా ఎంతో ఎదిగినట్లనిపించింది.

ఇంటికి తిరిగొచ్చిన నేను పద్మరూపాన్ని నా హృదయం నుంచి తొలగించుకోలేక పోయాను. 'పద్మ అలాకావడానికి నేనుకూడా కారకుడినా?' అన్న ప్రశ్న, బాధ నన్ను దహించసాగింది.

అది అలా రోజురోజుకి ఎక్కువకాసాగిందేగానీ తగ్గలేదు. మధ్యలో ఒకటి రెండుసార్లు వెళ్ళి వాళ్ళని చూసి వచ్చాను.

కాలం భారంగా మరో ఏడాదినిముందుకి నడిపేసింది. నేను హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో చేరాను. సెలవలకి వెళ్ళినప్పుడు అమ్మా, నాన్న నా పెళ్ళి ప్రస్తావన తీసుకొచ్చి, వచ్చిన సంబంధాల లిస్టుని చూపించారు. నేను అన్నీ చూసి ఆలోచించుకుని చెప్తానని పక్కకి పెట్టేశాను.

మామయ్యని చూసొస్తానని వెళ్ళిన నేను మామయ్యలేని టైముచూసి పద్మని సూటిగా ఒకటే ప్రశ్న వేశాను. 'పద్మా! నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. నీ అభిప్రాయమేమిటో ఆలోచించుకుని సాయంత్రంలోగా చెప్పు' అని బైటికొచ్చేశాను. నా మాటకి షాక్ కొట్టినట్లు నన్ను చూసిన పద్మ వెంటనే తలదించుకుంది.

సాయంకాలం మళ్ళీ వెళ్ళి అదే ప్రశ్న వెయ్యగానే, ఉదయం షాక్

తగిలినట్లు నాకేసి చూసిన పద్మే "నాకభ్యంతరంలేదు బావా" అంటూ నేనడిగినంత సూటిగానూ జవాబివ్వడంతో ఆశ్చర్యం, ఆనందంలో మునిగిపోయాను.

ఏదో పొందగలిగానన్న ఆనందం, ఏదో సాధించానన్న ఆనందం నా మనసుని ఉక్కిరిబిక్కిరి చేసేసింది. అదే ఆనందంతో మామయ్య దగ్గరికి వెళ్ళి, "మామయ్యా నేను పద్మని వివాహం చేసుకుందామనుకుంటున్నాను" అన్నదానికి కూర్చున్న చోటునుంచి ఒక్క ఉదుటున లేచి -

"భ్రష్టుడా! నీ ఉద్దేశ్యం ఏమిటిరా! మొదట్లో నీ గుమ్మం చుట్టూ తిరిగి బ్రతిమాలితే కాలదన్నేవు. నలుగుర్లో మేనల్లుడుండి చేసుకోలేదన్న అపవాదుని భరిస్తూ దానికీ పెళ్ళి చేశాను. దాని ఖర్మ, నా ఖర్మకాలి దాని బ్రతుకు అలా నాశనమైంది. ఏదో గుండెల్లో బండరాయేసుకుని బ్రతుకుతున్నాను. ఈనాడు తిండెట్టలేక వెధవముండకి పెళ్ళిచేశానని నలుగురిచేతా ఉమ్మేయించుకోమంటావుట్రా" అంటూ కోపం పట్టలేక ఎగరసాగాడు.

ఆ పరిస్థితుల్లో అతనితో ఏం మాట్లాడి ప్రయోజనంలేదని తెలిసిన నేను ఇంటికొచ్చి అవే మాటల్ని అమ్మా, నాన్నగారు కూర్చుని వుండగా చెప్పాను.

నాన్నగారు ఎప్పటిలాగే అన్నీ విని "నీ ఇష్టం" అని ఊరుకున్నారు. అమ్మమాత్రం నెత్తి మొత్తుకుంటూ "ఇదేం పొయ్యేకాలంరా! నీకేంలోటని మొగుడు పోయినదాన్ని పెళ్ళాడతాననంటున్నావు? లోకానికేం చెప్పాలి, నలుగుర్లో తలెత్తుకుని తిరగాలా?" అంటూ గొడవ చెయ్యసాగింది.

గదిలోకెళ్ళిపోయిన నా బుర్ర ఆలోచనల్తోవేడెక్కి పోసాగింది. ఆనాడు అమ్మ 'మేనకోడలురా' అంటూ ఒలకబోసిన ప్రేమ, అనురాగాలు ఇప్పుడే మయ్యాయి? మేనకోడలు కోడలయితే వుండే మంచిని నూరిపోసిన అమ్మ ఇప్పుడెందుకంగీరించడం లేదు? 'వైధవ్యం' అనే మూడక్షరాల పదం ఆమెని జీవితమంతా మోడులా పడుండమని శిక్షవేసిందా?

అమ్మ మేనకోడలు అన్న ప్రేమతో పద్మ జీవితాన్ని మళ్ళీ చిగురింపజెయ్యడానికి ఎందుకు ఒప్పుకోవడంలేదు? నిజంగా అమ్మకి పద్మంటే ప్రేమ వుందా? ఉంటే నన్ను ఎందుకు అడ్డుకుంటోంది? అటు మామయ్య ఆ ఇంటిచుట్టూ తిరిగే నన్నువాడు ఈనాడు నేను వెళ్ళి అడిగితే తిట్టి పోశాడెందుకు?

వీళ్ళలో మార్పు ఎలా తేవాలి? ఈ దురాచారాలు మాసిపోవాలంటే ఏం చెయ్యాలి?

కూతురంటే తండ్రికి ప్రేమలేక? మేనకోడలంటే అమ్మకి అభిమానంలేక!? కాదు వీళ్ళు సమాజానికి జడిసి అలా ప్రవర్తిస్తున్నారు. ఒక పరిధిలో పెరిగిన కొందరి ఆలోచనలు ఎదగక ఇరవై ఏళ్ళు నిండని పద్మ జీవితాన్ని నాశనం చేస్తున్నారు.

ఆనాడు జీవితంలో స్థిరపడ్డాక పెళ్ళి చేసుకుంటానంటే కారణం అర్థం చేసుకోలేదిద్దరు. ఈనాడు ఒక మోడుబారిన చెట్టుని చిగురింపజేస్తానంటే అందులో మంచిని తెలుసుకోటంలేదు.

ఏమిటీ మనుష్యులు?! తప్పు ఆతరం వారిదా? లేక ఆ పల్లె వాతావరణానిదా??

ఏది ఏమయినా నేను మేజర్ని, పద్మ మేజరు - పద్మ అంగీకారం లభించింది. అంటే పద్మకి అయిన ఆ పెళ్ళి కూడా బలవంతపు పెళ్ళే అన్నమాట. మా ఇరువురికి ఇష్టమైనప్పుడు మమ్మల్ని అడ్డేదెవరు? సమాజాన్ని, ఇంట్లో వద్దన్నవారిని ఎదుర్కొంటాను. నేను పద్మని పెళ్ళి చేసుకుతీరతాను. కాలానికి, సమాజానికి భయపడే అమ్మా, మామయ్యలు కొంత కాలం తరువాత మారకపోతారా? రక్తసంబంధాలు తెంపుకుంటారా? చూద్దాం అంటూ లేచాను ఒక గట్టి నిర్ణయానికొచ్చిన నేను. ❋

**(డిసెంబరు 1995 స్వాతి)**

కథా నిలయం
5592
శ్రీకాకుళం